

సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లిలో కూలిన ఇల్లు



రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. చెరువులు, కుంటలు మత్తడి దుకుతుండగా.. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ధాటికి రోడ్లు కొట్టుకుపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడక్కడ ఇళ్లు కూలిపోయాయి. జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న నంగునూరు - ఘనపూర్ పెద్దవాగు

- నిండుకుండల్లా చెరువులు, పొంగిపొర్లుతున్న వాగులు
- జిల్లాలో 8.2 సెం.మీ. వర్షపాతం
- పలు గ్రామాలతోపాటు హన్మకొండ సిద్దిపేటకు రాకపోకలు బంద్
- జలదిగ్బంధంలో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదు
- అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- నేడు విద్యాసంస్థలకు సెలవు.. ప్రజావాణి రద్దు : కలెక్టర్

కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నం. 08457230000



భారీ వర్షానికి ధూళిమిట్ట మండలకేంద్రంలో కూలిన నాచగోని శ్రీనివాస్ ఇంటిని పరిశీలిస్తున్న తహశీల్దార్ మధుసూధన్



కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఇంట్లోకి వచ్చిన వరద నీరు..



జలదిగ్బంధంలో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్



దౌల్తాబాద్: ఉప్పర చెరువు నిండి అలుగు పారుతుండడంతో గువ్వలేగి,ఉప్పరపల్లికి వెళ్లే దారిలో నిలిచిన రాకపోకలు



బెజ్జంకికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



రాయపోల్ మండలం వడ్డెపల్లిలో ఫారెస్ట్ ట్యాంక్ కుంట కట్ట తెగడంతో నెలకొరిన పత్తి పంట

# అతలాకుతలం..

## భారీ వర్షంతో స్తంభించిన జనజీవనం

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 1: జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. ఇండ్లు, దుకాణాలు, ఆలయాల్లోకి నీరు చేరింది. గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా 8.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. ఈ సీజన్లో ఇదే రికార్డు. వరద ఉధృతికి రోడ్లు తెగిపోవడవంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం(08457230000)కు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి సంబంధిత సహాయక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా.. ప్రజావాణిని సైతం రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. ధూళిమిట్ట మండల కేంద్రంలోని నాచగోని శ్రీనివాస్ ఇల్లు కూలిపోయింది. కూటిగల్‌లో నల్ల చెరువు మత్తడి పోయడంతో గ్రామం నుంచి తరిగొప్పుల మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో కేశవుల యాదగిరికి చెందిన ఇల్లు కూలింది. మిట్టపల్లి దాటిన తర్వాత నిర్మిస్తున్న బ్రిడ్జి తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మర్కుక్ మండలంలోని గంగాపూర్ యూసుఫ్‌ఖాన్‌పల్లిలో ఇల్లు కూలి నిరాశ్రయులుగా ఉన్న ఓ కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. తొగుట మండలం వెంకట్రావ్‌పేటవాగు వద్ద వరద ప్రవాహానికి పోలీసులు రోడ్డును మూసివేశారు. హుస్నాబాద్, పందిళ్లవాగు పొంగిపొర్లడంతో తాత్కాలికగా వేసిన రహదారి తెగిపోయింది. నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఇల్లు కూలింది. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు కల్వర్టు కొట్టుకుపోయింది. మల్యాలలో వడ్లోని కట్ట తెగి గ్రామంలోని శివాలయంకాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో మూడు ఇండ్లను ఖాళీ చేయించి గ్రామ కులసంఘం భవనంలోకి తరలించారు. సికింద్లాపూర్-నంగునూరు మండలం దర్గపల్లి మధ్య వాగు ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. బస్వాపూర్ గ్రామం వద్ద హన్మకొండ-సిద్దిపేట ప్రధాన రహదారిని, మోయ తుమ్మెద వాగు వద్ద రహదారిని పోలీసులు మూసివేశారు. రాయపోల్ మండలంలో వడ్డెపల్లిలో జండా గుట్ట కింది కుంట(ఫారెస్ట్ ట్యాంక్) తెగిపోయింది. దీంతో కుంట వెనక ఉన్న సుమారు 5 ఎకరాల పత్తి పంట ధ్వంసమైంది. కొత్తపల్లిలో వరి పంటలు నీటిలో మునిగాయి. పందిల్ల వాగు లోతట్టు కల్వర్టు తెగిపోతుందని గ్రహించిన పోలీసులు పలు



దుద్దెడ శివారులో తెగిపోయిన బందారం వెళ్లే రోడ్డు

గ్రామాలతోపాటు హన్మకొండకు రాకపోకలు నిలిపివేశారు. భారీగా వచ్చిన వరదతో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుంది.

### మండలాలవారీగా వర్షపాతం ఇలా..

మిరుదొడ్డి 15.2 సెం.మీ, సిద్దిపేట రూరల్ 13.9, నారాయణరావుపేట 13.8, కొండపాక 11.6, ధూళిమిట్ట 11.1, మద్దూర్ 10.4, అక్కన్నపేట 10.3, కుకునూర్‌పల్లి 9.9, తొగుట 9.8, మర్కుక్ 9.4, నంగునూర్ 9.4, కోహెడ 9.4, కొమురవెల్లి 8.8, దుబ్బాక 8.8, సిద్దిపేట అర్బన్ 8.7, జగదేవ్‌పూర్ 8.6, గజ్వేల్ 8.2, చిన్నకోడూర్ 8.2, దౌల్తాబాద్ 6.7, వర్గల్ 5.6, చేర్యాల 5.4, ములుగు 4.1, అక్బర్ పేట-భూంపల్లి 1.5, బెజ్జంకి 1.4, హుస్నాబాద్ 1.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



హుస్నాబాద్ పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## అత్యవసరమైతేే తప్ప బయటకు రావొద్దు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, సెప్టెంబరు 1 : వర్షాలతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఈ విషయంపై జిల్లా కలెక్టర్, సీపీ, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర అన్ని శాఖల అధికారులతో ఫోన్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. జనం అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. లో లెవెల్ వంతెనలు, కాజ్‌వేల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

### హుస్నాబాద్‌లో పర్యటన..

పట్టణంలోని వరదనీటి ప్రాంతాలను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. దుకాణాలు, ఇళ్లలోకి వరదనీరు చేరిన బాధితులతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో ఇప్పుడు జరిగిన నష్టం వచ్చే వర్షాకాలం లోపు మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, సింగిల్‌విండో చెర్మన్ శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

## వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు : సీపీ

చిన్నకోడూరు, సెప్టెంబరు 1 : వాహనదారులు, ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ సూచించారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రవహిస్తున్న వాగులను ఆదివారం ఆమె పరిశీలించారు. పోలీసులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మండలంలో సమస్య ఉన్న గ్రామాలను డీఎల్పీవో మల్లికార్జున్, ఎంపీవో సోమిరెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.



చిన్నకోడూరు మండలం రామునిపట్ల-గోనెపల్లి మధ్య ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న సీపీ అనురాధ

### మందపల్లి వాగు పరిశీలన..

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 1 : సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును సీపీ అనురాధ పరిశీలించారు. సిబ్బందితో కలిసి అటువైపుగా రోడ్డును బ్లాక్ చేయించి తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజలను వాగు వద్దకు రాకుండా చూడాలని సూచించారు. బక్రీ చెప్యాలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి నీరు చేరడంతో అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది అక్కడ సహాయక చర్యలు చేపట్టారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

చేర్యాల, సెప్టెంబరు 1 : భారీవర్షాల దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన పలువురు అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడి సహాయకచర్యలు చేపట్టాలని సూచించారు. చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ నుంచి బస్టాండు వరకు గల వరదనీటిని మళ్లించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌తో మాట్లాడారు.

## బీఆర్ఎస్ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**



సిద్దిపేట టౌన్, సెప్టెంబరు1: వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యల్లో బీఆర్ఎస్ శ్రేణలకు సూచించారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణ కౌన్సిలర్లు, మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులతో సమన్వయము చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఏమైనా ప్రమాదాలు జరిగినట్లయితే తన దృష్టికి తీసుకరావాలని చెప్పారు.




ఉధృతంగా ప్రవహిస్తున్న చేర్యాల మండలం తాడూరు వాగు

---


చదువు ప్రాముఖ్యత తెలిపేందుకు

## ‘రీడ్ ఏ థాన్’

- 3న అన్ని పాఠశాలల్లో అరగంట పాటు ఒకేసారి పుస్తక పఠనం 7

# ఫసల్ బీమా లేనట్టే!

- వానాకాలం సీజన్‌కు ముగిసిన ప్రీమియం చెల్లింపు గడువు
- యాసంగికైనా అమలయ్యేలా చూడాలని రైతుల వినతి

గజ్వేల్, సెప్టెంబరు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినా ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకంపై శీతకన్ను వేసిందని, తాము ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కార్ చెప్పింది. అయితే రైతులకు మరోసారి ఎదురుచూపులు తప్పడంలేదు. ఇప్పటికే మక్కజొన్న, పత్తి, వరి, అపరాల సాగు పూర్తి కాగా, పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు సైతం ముగిసింది. దీంతో ఈ సీజన్‌కు ఫసల్ బీమా యోజన పథకం అటకెక్కినట్లేనని రైతులు భావిస్తున్నారు. బీమా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఎటు తేల్చకపోవడంతో రైతన్నల ఆశలు ఆవిరి అయ్యాయి. గత ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగడంతో ఈ ప్రభుత్వమైనా పథకంలో చేరుతుందని భావించినప్పటికీ అన్నదాతలకు నిరాశ తప్పలేదు.

### యాసంగికైనా అమలయ్యేనా...?

వానాకాలంలో బీమా అమలుకు నోచుకోకపోవడంతో యాసంగిలోనైనా ఈ పథకం అమల్లోకి వస్తుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. యాసంగిలోగా నిర్ణయం తీసుకొని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో యాసంగిలో ఏటా సంభవించే పంట నష్టం ఈ ఏటా సంభవిస్తే రైతులు అప్పుల పాలు కాక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### ఏటా యాసంగిలో భారీ నష్టం..

జిల్లాలో ఏటా యాసంగిలో వడగండ్ల వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఐదేళ్లుగా ఫసల్ బీమా యోజన పథకం అమలులో లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలవుతున్నారు. ఈ క్రమంలో ఫసల్‌బీమా యోజన పథకం అమలులో ఉంటే ఎంతో ఊరట దక్కేదని రైతులు భావిస్తున్నారు. యాసంగి సీజన్ నుంచైనా పంటల బీమాను అమలులోకి తేవడంతో పాటు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి రైతులు పథకంలో చేరేలా చూడాలని కోరుతున్నారు.

### ఐదు లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 5.20 లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేశారు. వరి 3.20లక్షల ఎకరాలు, పత్తి 1.10 లక్షలు, మక్కజొన్న 25 వేలు, కంది 6 వేల ఎకరాల్లో సాగుచేయగా, ఇతర పంటలను 25వేల ఎకరాల్లో వేశారు.




పోయింది కొండంత..

## దొరికింది గోరంత

- జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్
- అయినా ఫలితం శూన్యం
- ప్రతీ రోజు రెండు, మూడు కేసులు
- దొరకని సైబర్ నిందితులు
- పోలీస్‌స్టేషన్ల చుట్టూ బాధితులు

7


ప్రమాదానికి గురైన కారు

## బస్సును ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు


కొండపాక, సెప్టెంబరు 1: ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన కొండపాక శివారు రాజీవ్‌రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు మండలం పాలమాకులకు చెందిన పలువురు కొండపోచమ్మ ఆలయానికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక శివారులో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీ కొట్టింది. దీంతో అందులో ఉన్న నాగరాజు, నర్సింహులు, లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టోల్‌గేట్ అంబులెన్స్ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### తండ్రి మందలించాడని
## కుమారుడి ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం

శివ్వంపేట, సెప్టెంబర్ 1 : ఖాళీగా ఉండకుండా పనికి వెళ్లాలంటూ తండ్రి మందలించడంతో కొడుకు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి విషమించిన సంఘటన పిల్లుట్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పిలుట్ల గ్రామానికి చెందిన చింత శ్రీధర్(21) ఇంట్లో ఖాళీగా ఉంటుండడంతో ఖాళీగా ఉంటే వ్యసనాలకు అలవాటు పడతారని, పని చేసుకోమని తండ్రి చింత స్వామి కొడుకును మందలించాడు. దీంతో శ్రీధర్ శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

### కాలుష్య పరిశ్రమను తొలగించాలని
## పీసీబీ కార్యాలయానికి పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సాయిని సన్మానిస్తున్న వ్యకాస నాయకులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 : కాలుష్యం వెదజల్లుతూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎవరెస్ట్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్, పూలే మహాజన సంఘం రాష్ట్ర యువజన కో కన్వీనర్ సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిశ్రమ నుంచి హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తున్న సాయిని సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ కాలుష్య పరిశ్రమతో జన జీవనం కష్టతరమైందని అందుకే పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని పాదయాత్ర చేపట్టానన్నారు. అనంతరం వ్యకాస, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింలు, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ కాలుష్య వ్యర్థ జలాలను కాలువల ద్వారా బయటికి వదిలి పంటలను నాశనం చేస్తూ ప్రజలకు ప్రాణహాని కలిగిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చూసి వెలుతున్నారే తప్ప ఎలాంటి పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే ఎవరెస్ట్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని రైతులు, స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ కడుపుతో.. వణుకుతున్న దేహంతో..

● జోరు వానలో యాచకురాలి దీనస్థితి


తడిచిన వస్త్రాలతో, చలికి వణుకుతూ దీనంగా కూర్చున్న యాచకురాలు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 1: నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు యాచకుల పరిస్థితిగా దీనంగా మారింది. అనునిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని దుకాణాలన్నీ మూసివేయడం, రోడ్లపై జనసంచారం లేకపోవడంతో యాచకుల ఆకలి తీర్చే వారు కరువయ్యారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లేదారి పక్కన మూసేసి ఉన్న దుకాణాల ముందు బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఉన్న యాచకురాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలికి వణుకుతూ, ఎవరైనా దాతలు వచ్చి తమ కడుపు నింపుతారేమోనని దీనంగా కూర్చున్నది. ఆమె దీనస్థితి చూసి పలకరిస్తే మాట్లాడే పరిస్థితి లేదని, తడిచిన బట్టలతో వణుకుతూ ఉన్నది.

## మెదక్ చర్చిని సందర్శించిన మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్


రిటైర్డ్ జస్టిస్ విమల జైన్‌ను సన్మానిస్తున్న చర్చి కమిటీ అధ్యక్షుడు సంపత్, ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 1: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిని ఆదివారం ఉదయం మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ విమల జైన్ సందర్శించారు. వీరిని చర్చి కమిటీ సభ్యులు సన్మానించారు. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో శిలువ ఆరాధాన నిర్వహించి, ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి పదవికి..

● పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్


గుండు లక్ష్మణ్

కల్హేర్, సెప్టెంబరు 1: కల్హేర్ మండలం బీబీపేట గ్రామానికి చెందిన గుండు లక్ష్మణ్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆదివారం నియామకయ్యారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగిడిన లక్ష్మణ్ ఉపాధ్యాయుల సమస్యలు తీర్చుతూ వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పీఆర్టీయూ సంఘంలో సాధారణ సభ్యుడిగా చేరి అంచలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ఎంతో పోటీ ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ బాధ్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించారు. నిన్నటివరకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన కమలాకర్ పదవీ విరమణ చేయడంతో హడ్‌హక్ పద్ధతిన లక్ష్మణ్ నియామకం కాగా.. హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం ప్రమాణం చేశారు. తన ఎన్నికకు కృషిచేసిన టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కమలాకర్, మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవిందర్‌కు లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం

గజ్వేల్, సెప్టెంబరు 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందాడు. గజ్వేల్ సీఐ బి.సైదా వివరాల ప్రకారం.. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ వద్ద శనివారం రాత్రి 10 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి పడి ఉన్నాడన్న సమాచారంతో బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో రాత్రి 11.40 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుడు యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి 68 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎవరైనా గుర్తు పడితే వెంటనే గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

## ఆవును రక్షించబోయి.. కెనాల్‌లో పడి రైతు మృతి


కనకారెడ్డి మృతదేహం

కోహెడ, సెప్టెంబరు 1: ఆవును రక్షించబోయి.. కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి రైతు ఆదివారం మృతిచెందాడు. తోటపల్లి నుంచి గౌరవెల్లికి వెళ్లే ప్రధాన కాలువ రామచంద్రపూర్ గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ ప్రధాన కాలువకు బొబ్బుల కనకారెడ్డి(65) అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి ఉన్నది. బావి వద్ద ఉన్న పశువుల కొట్టంలో కట్టేసి ఉంచిన ఆవు తెంపుకుని కెనాల్‌లో పడింది. దానిని కాపాడేందుకు రైతు కాలువలోకి దిగాడు. కెనాల్‌లోని నీటితోపాటు, వరదనీరు ఎక్కువ ఉండడంతో అడుగుభాగాన బురదలో ఇరుక్కుపోయి రైతు మృతిచెందాడు. కనకారెడ్డి కాలువలోకి దిగినప్పుడు కొందరు రైతులు చూసి గ్రామస్థులకు చెప్పారు. వారు వచ్చి బురదలో ఇరుక్కుపోయిన కనకారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు.

## కుటుంబ తగాదాలతో గృహిణి ఆత్మహత్య

రామచంద్రాపురం, సెప్టెంబరు 1: కుటుంబ తగాదాలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌లోని సైబర్ కాలనీలో సంగీతప్రియ(30), రాజ్‌కుమార్ దంపతులు నివాసముంటున్నారు. కుటుంబంలో నెలకొన్న చిన్నచిన్న విషయాలకు భార్యాభర్తలు గొడవపడేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా గొడవపడ్డారు. అనంతరం సంగీతప్రియ గదిలోకి వెళ్లి గడియ వేసుకుంది. భర్త తలుపులు తట్టినా తీయలేదు. తలుపులు బద్దలుకొట్టి చూడగా.. భార్య శవమై కనిపించింది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఆ దంపతులకు రెండేళ్ల పాప ఉండటంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త రాజ్‌కుమార్ స్థానికంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కుక్క కాటుతో వ్యక్తికి తీవ్ర గాయాలు


సుదర్శన్ కాలుకు అయిన గాయం

కంగ్టి, సెప్టెంబరు 1: కుక్కకాటుతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రమైన కంగ్టి గ్రామానికి చెందిన కంతి సుదర్శన్(55) ఆదివారం ఉదయం బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ వద్ద వెనుక నుంచి వచ్చిన కుక్క సుదర్శన్ కాలును గట్టిగా కరిచింది. తీవ్రగాయాలైన సుదర్శన్‌ను స్థానికులు కంగ్టి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. కాగా కంగ్టిలో కుక్కల బెడద అధికమైందని, అరికట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


మెదక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఐక్య కార్యాచరణ సమితి ఉద్యోగులు


సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న టీజీఈజేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు


సిద్దిపేట కల్చరల్: సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న జేఏసీ ఉద్యోగ సంఘం నాయకులు

# నూతన పెన్షన్ రద్దుకు మరో ఉద్యమం

● టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్
● సీపీఎస్‌ను రద్దు చేయాలని నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ సంఘాల నిరసన

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1: నూతన పెన్షన్ విధానం రద్దుకు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నట్లు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం అమలైన 20 ఏళ్లల్లో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భద్రతనిచే పెన్షన్ లేకపోవడంతో చాలామంది విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నిరసనలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, టీఎన్జీవో, ట్రెసా, పీఆర్టీయూ, తపస్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, మహేందర్‌గౌడ్, సుంకరి కృష్ణ, ఎల్లం, సంగయ్య, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మరావు, శివయ్య, సత్యనారాయణ, వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు మల్లారెడ్డి, చంద్రశేఖర్, హీరాలాల్, సత్యనారాయణరెడ్డి, ఫణిరాజ్, ఫజులొద్దీన్, నగేష్, శివరాం, గోపాల్, రామాగౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

●నర్సాపూర్: పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్ మండల విద్యాధికారి కార్యాలయం వద్ద వర్షంలోనే ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 2004 నుంచి అమలవుతున్న నూతన పెన్షన్ వల్ల ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాకియా, నాగుర్‌మీరా, రమేష్‌రాజు, శివకుమార్, అప్పలనాయుడు, భాస్కర్, శ్రీహరి, పెంటయ్య, నరేందర్, శ్రీహరి, కృష్ణ, శ్రీనివసరావు, రాములు పాల్గొన్నారు.

### ఉద్యోగుల పాలిట శాపంగా 'సీపీఎస్'

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1: ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ చైర్మన్ జావిద్‌అలీ, కో చైర్మన్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు వర్షాన్ని లెక్కచేయకుండా నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ నిరసన ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానం రద్దు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ వేతన సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల నాయకులు వై.అశోక్‌కుమార్, సాబేర్‌అలీ, వి.రవి, సుధామణి పాల్గొన్నారు.


నర్సాపూర్ ఎంఈవో కార్యాలయం వద్ద వర్షంలోనే నిరసన తెలుపుతున్న జేఏసీ ఉపాధ్యాయులు

### పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకుడు గ్యాదరి పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేంత వరకు అన్ని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలను కలుపుకొని ఐక్యపోరాటం చేస్తామన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 1న పెన్షనర్ల విద్రోహ దినమని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్తాబాద్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, శశిధరశర్మ, రాజేశం, యాదగిరి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1: కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయించిన రూ.5 వేల కోట్లను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్-తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని గురువందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ చిన్నతనంలో వారికి చదువులు నేర్పిన గురువులను స్మరించుకుని గురువుల గొప్పదనం గురించి కొనియాడారు. అఖిల భారత సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర యోగి మాట్లాడుతూ గురువుల ఔనత్యాన్ని చాటేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాస్థాయిలో విశిష్ట సేవలందించి 78 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేశ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్, కార్యదర్శి దుబాషి భాస్కర్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

### పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. టీపీటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదల చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టీచర్లు లేనిచోట వాలంటీర్లను నియమించాలని కోరారు. అనంతరం ఇటీవల పదోన్నతి పొందిన, పదవీ విరమణ చేసిన టీపీటీయూ సభ్యులను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు నక్క రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భుజంగం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

## 'ఆశా'ల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, అధికారుల వేధింపులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశాలు 12 ఏళ్లుగా పనిచేస్తున్నా.. నేటివరకూ వారికి కనీస వేతనం లేదన్నారు. రోజురోజుకు పనిభారం పెంచుతున్నారే తప్ప వేతనం పెంచడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. వేతనాలు పెంచడమే కాదు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆశాలను విస్మరిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని సాయిలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వరలక్ష్మీ, నాయకులుల ప్రశాంతి, వీరమణి, లావణ్య, పద్మ, విజయలక్ష్మి, సునీత, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చదువు ప్రాముఖ్యత తెలిపేందుకు 'రీడ్ ఏ థాన్'

● 3న అన్ని పాఠశాలల్లో అరగంట పాటు ఒకేసారి పుస్తక పఠనం


సామూహిక పుస్తకం చదువుతున్న విద్యార్థులు

కొండపాక, సెప్టెంబరు 1: మిషన్ నిపున్ భారత్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చదవడం, రాయడం, గణిత భావనల్లో చతుర్విధ ప్రక్రియలు చేయడం వంటి కనీస సామర్థ్యాలు పెంపొందిస్తే భావితరం మరింత నైపుణ్యవంతమైన దేశంగా తయారవుతుందని భావన. పిల్లల్లో చదివే నైపుణ్యం, అలవాటును పెంచేందుకు రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతీ విద్యాసంవత్సరం ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 8 వరకు పాఠశాల విద్యాశాఖతో కలిసి రాష్ట్రస్థాయి రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం మేక్ రూమ్ ఫర్ ఎర్లీ మార్నింగ్ థీమ్‌తో 3 నుంచి 8 వయసు ఉన్న చిన్నారుల్లో చదివే అలవాటు, చదివే నైపుణ్యం మరింత బలోపేతం చేయడానికి సెప్టెంబరు 3న ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య ప్రతీ పాఠశాలలో డ్రాప్ ఎవ్రీథింగ్ అండ్ రీడ్, రీడ్ ఏ థాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 3న అరగంట సేపు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతిఒక్కరికీ పుస్తక పఠనం చేసేవిధంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. చిన్నారుల్లో చదివే నైపుణ్యాన్ని పెంపొందించడానికి నిర్విరామ కృషి చేస్తున్న రూమ్ టూ రీడ్ రాష్ట్ర ప్రతినిధి నరసింహచారి, జిల్లా ప్రతినిధులు రవి, మధు, సునీతలను జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

### పుస్తక పఠనాన్ని విజయవంతం చేయాలి: డీఈవో

మిషన్ నిపున్ భారత్‌లో భాగంగా ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడం లాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో అమలవుతున్నాయి. 3 నుంచి 5 సంవత్సర పిల్లలు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే దిశగా ముందుకు వెళ్తున్నాం. అది ఈ ఏజ్ గ్రూప్‌లోనే ఒక అలవాటుగా మార్చితే సుసాధ్యం చేసుకోగలం. ఈ దిశగా రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో 3న నిర్వహించబోయే రీడ్ ఏ థాన్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. ఆ రోజు ఉదయం 11 నుంచి 11.30 వరకు ఎక్కడి వారం అక్కడనే పుస్తక పఠనం చేసి చదవడం ప్రాముఖ్యతను లోకానికి చెప్పుదాం.

## కొమురవెల్లిలో పందులు, కుక్కల బెడద

● ఆందోళనలో గ్రామస్థులు, భక్తులు


మల్లన్న ఆలయ రాతిగీరెల ప్రాకార ఆవరణలో పందులు

చేర్యాల, సెప్టెంబరు 1: కొమురవెల్లి మండల కేంద్రంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుంటంతో ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజులుగా పందులు మల్లన్న ఆలయ పరిసరాలు, రాతిగీరెలు, బుకింగ్ కార్యాలయ ఆవరణలో సంచరిస్తూ వ్యర్థాలను వెలికితీస్తూ అపరిశుభ్ర వాతావరణాన్ని తలెత్తిస్తుండటంతో సమీపవాసులు తంటాలుపడుతున్నారు. అంతేకాకుండా వీధులు, దారి వెంట కుక్కలు సంచరిస్తూ నడుచుకుంటూ పోయేవారితో పాటు వాహన చోదకులను వెంబడిస్తున్నాయి. అధికారులు స్పందించి పందుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# పోయింది కొండంత.. దొరికింది గోరంత..

● సిద్దిపేట జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
● ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్
● అయినా ఫలితం శూన్యం
● ప్రతీరోజు రెండు, మూడు కేసులు నమోదు
● దొరకని సైబర్ నిందితులు
● పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు



సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 1: సిద్దిపేట జిల్లాలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. చదువుకోని వృద్ధులతోపాటు, చదువుకున్న యువకులు, మేధావులు, అధికారులు సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతున్నారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైం జాబ్, విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్‌కార్డ్ అప్‌డేట్స్, ఆధార్‌కార్డు లింకు పేర్లతో మెసేజ్‌లు రాగానే ప్రజలు ఆశపడి మోసపోతున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో, పట్టణాల్లో, విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ నేరాలు తగ్గడం లేదు. సైబర్ నేరాల ను అరికట్టడంలో పోలీసులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పేరుకే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సైబర్ నేరాలను అరికట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్‌స్టేషన్లో ప్రతిరోజు రెండు, మూడు సైబర్ క్రైమ్ కేసులు నమోదవుతున్నాయి అంటే జిల్లా పోలీసు అధికారులు సైబర్ నేరాలను నివారించడంలో విఫలమైనట్లు తెలుస్తున్నది.

### ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్

జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930కు కాల్‌చేసి వివరాలు నమోదు చేసి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. సైబర్ క్రైమ్ జరిగిన గంటలోపు 1930కు కాల్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అమౌంట్ సీజ్ చేస్తామని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ కొంతమంది బాధితులు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. పోగొట్టుకున్న అమౌంటును సీజ్‌చేసి బాధితులకు అప్పగించడం లేదు. సైబర్ క్రైమ్‌లను నివారించడానికి జిల్లాలో ప్రత్యేకంగా సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. అందులో ఒక ఏసీపీ, సీఐ, ఎస్ఐలను విధులు నిర్వహిస్తున్నా.. ఫలితాలు మాత్రం శూన్యమనే చెప్పవచ్చు. రెండురోజుల క్రితం బెజ్జంకి పోలీస్‌స్టేషన్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్లలో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించి మోసం చేసిన కేసులో రంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు సైబర్ నేరస్తులను హైదరాబాద్‌లో సిద్దిపేట సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంవత్సరంలో సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న డబ్బుల్లో పోలీసులు కేవలం 20 శాతం ఫ్రీజ్ చేశారు

### ప్రతీరోజు రెండు, మూడు కేసులు

జిల్లాలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట సైబర్ క్రైమ్ జరుగుతున్నది. ప్రజల బలహీనతలైన ఆశ, భయం రెండిటిని సైబర్ నేరగాళ్లు చూపెట్టి డబ్బులు దోచుకుంటున్నారు. బాధితులు ప్రతిరోజు స్థానిక పోలీస్‌స్టేషన్లకు, కమిషనర్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు బారులు తీరుతున్నారు. సరైన న్యాయం దొరక్క వెనుదిరుగుతున్నారు. అధునాతన టెక్నాలజీ ఉన్నప్పటికీ సైబర్ నేరస్తులను మాత్రం పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నట్లు పలువురు బాధితులు విమర్శిస్తున్నారు.

### దొరికింది.. గోరంతే..

జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 165 సైబర్‌క్రైమ్ కేసులు నమోదయ్యాయి. రూ.3,84,75,893 బాధితులు పోగొట్టుకోగా... పోలీసులు కేవలం రూ.87,13,872 ఫ్రీజ్ చేశారు. ఈ సంవత్సరం సైబర్‌క్రైమ్ పోలీసులు కేవలం ఎనిమిదిమంది నిందితులను మాత్రమే అరెస్టు చేశారు. అధికారికంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసిన వారు 165 మంది అయితే.. అనధికారికంగా ఫిర్యాదు చేయని వాళ్లు చాలామంది ఉన్నారు. బయటకు చెబితే పరువుపోతుందని ఫిర్యాదు చేయకుండా వెనకడుగు వేస్తున్నారు. ప్రతిరోజు రాంగ్ కాల్స్‌తో, రాంగ్ మెసేజ్‌లతో సైబర్ క్రైమ్‌కు గురవుతున్నారు. ఇకనైనా పోలీసులు సైబర్‌క్రైమ్ కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకొని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సూచించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పర్యటించారు. పట్టణంలో ఎక్కడా వర్షం నీరు నిల్వ ఉండకుండా యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన గృహాలను ఖాళీ చేయాలని అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లొద్దని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ సూచించారు. సిద్దిపేట పట్టణంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిచారు. పట్టణంలో మున్సిపాలిటీకి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా హెల్ప్ డెస్క్ నెంబర్ 9505507248కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా యూజీడీ మ్యాన్‌హోల్స్‌పై కప్పులు తెరిచినట్టు కనిపిస్తే వాటిని అధికారులు, సిబ్బంది మూసివేయలన్నారు.

\- సిద్దిపేట టౌన్


కొండపాక: రోడ్డు తెగిపోవడంతో వర్షపు నీటిలో మునిగిన పంట పొలాలు


చేర్యాల: జలదిగ్బంధమైన చేర్యాల సెవెన్‌హిల్స్ హోటల్ వెనుక ప్రాంతం


గజ్వేల్: మండలం బూర్గుపల్లిలో పొంగిపొర్లుతున్న కూడవెల్లి వాగు


సిద్దిపేట టౌన్: సిద్దిపేట పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్


దౌల్తాబాద్: గాజులపల్లిలో తుమ్మ చెరువులో నీట మునిగిన వరి


హుస్నాబాద్: చెరువులా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా


వర్గల్: గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు


నంగునూరు శివారులో వాగు వైపు ఎవరూ వెళ్లకుండా చూస్తున్న అధికారులు


దూళిమిట్ట :పొంగిపొర్లుతున్న మోయతుమ్మెద వాగు


మద్దూరు: మర్మాములలో ఆయిల్‌పామ్ తోటలోకి చేరిన వర్షపు నీరు


హుస్నాబాద్‌రూరల్: మహ్మదాపూర్‌లో ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న వరద నీరు


అక్కన్నపేట: మత్తడి దూకుతున్న గోవర్ధనగిరి చెరువు


జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై పడిపోయిన భారీ వృక్షం


కోహెడ: శనిగరంలో హైస్కూల్ వద్ద వరద నీరు


గజ్వేల్: మండలంలోని రిమ్మనగూడ వద్ద రైల్వే బ్రిడ్జి కింద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


దూళిమిట్ట: బెక్కల్ ఎర్ర చెరువు మత్తడి పోయడంతో కట్ట మైసమ్మ తల్లికి పూజలు చేస్తున్న గ్రామస్థులు


మర్కుక్: గాంగాపూర్ యూసుఫ్‌ఖాన్‌పల్లిలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీటీసీ

## అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైరపర్సన్


అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 1: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణంలోని 2వ వార్డులో బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజులరాజనర్సు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ నాయిని చంద్రం, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు బెల్లె రాములు, రాజమల్లు, బెల్లె ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ నర్సింహులు, కూరే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'గణేష్ మండపాల ఏర్పాటుకు దరఖాస్తులు అందజేయాలి'

మద్దూరు, సెప్టెంబరు 1: మండలంలోని గ్రామాల్లో గణేష్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసే మండలపాలకు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పోర్టల్‌లో నమోదు చేసుకుని అట్టి దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందని ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఆదివారం తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ మాట్లాడారు. నిర్వాహకులు తప్పని సరిగా పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని తెలిపారు.

## ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మండలాధ్యక్షుడు

కొండపాక, సెప్టెంబరు 1: రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటస్వామిని కొండపాక మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమ్ము భానుచందర్ ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు1: ఇంటి ఆవరణలో నీరు నిల్వ, చెత్త ఉండనివ్వకూడదని, వాటి ద్వారా దోమల లార్వా వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తాయని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని సాజిద్‌పుర, రాఘవేంద్రనగర్‌లో డెంగీ బారినపడిన వారి ఇంటి వద్దకు ఆదివారం ఆయన వెళ్లి వారి ఇంటి చుట్టూ బ్లీచింగ్, మలాతిన్ వైద్య మున్సిపల్ శాఖ సిబ్బందితో పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు గోరువెచ్చని వేడి నీటిని తాగాలని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్

సిద్దిపేట మున్సిపల్‌గా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆశ్రిత్‌కుమార్ ఆదివారం చైర్‌పర్సన్ మంజులరాజనర్సును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమెను శాలువాతో సన్మానించారు.

## రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

- ఏఈవో ప్రణిత

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: వర్షకాలంలో పంటలు సాగు చేసిన రైతులు ఏఏ పంటలు సాగు చేశారనేది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అందు కోసం రైతులు సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత రైతు వేదికలో తమకు అందజేయాలని ఏఈవో ప్రణిత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మహ్మదాపూర్‌లో సాగు చేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల వివరాలను నమోదు చేసుకుని రైతులు పంటను విక్రయించేటప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో పంటల వివరాలు ఉంటేనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి రైతు తప్పని సరిగా తమ పంటల వివరాలు తెలియజేయాలన్నారు.

# లోలెవల్ వంతెనతో తప్పని తిప్పలు

- ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు
- హైలెవల్ వంతెన నిర్మించాలని వేడుకోలు

దౌల్తాబాద్, సెప్టెంబరు1: వర్షాకాలంలో లోలెవల్ వంతెనలపై నుంచి వరదలు ప్రవహిస్తుండడంతో దౌల్తాబాద్ మండలంలోని గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాల నుంచి దౌల్తాబాద్‌కు, ఇతర గ్రామాలకు, పట్టణాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏళ్ల కిందట నిర్మించిన లోలెవల్ వంతెనలు చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న లోలెవల్ వంతెన చిన్నపాటి వర్షాలకే పొంగిపొర్లడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఆస్పత్రికి వెళ్లాలన్నా, అత్యవసర పనుల కోసం ఊరు దాటాలన్నా సాధ్యం కావడం లేదని, ఇప్పటికైనా వంతెన నిర్మించాలని గువ్వలేగి, ఉప్పరపల్లి, దౌల్తాబాద్ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### కష్టాలు పడుతున్నాం



మండలంలోని గువ్వలేగి, ఉప్పరపల్లి సమీపంలో హైలెవల్ వంతెన నిర్మించాలని ఏళ్లుగా అధికారులు, పాలకులను వేడుకుంటున్నాం. ఏటా వర్షా కాలంలో వరదలు వస్తే గ్రామం నుంచి బయటకు వెళ్లలేక పోతున్నాం

\- సాయిలు, గువ్వలేగి గ్రామం, దౌల్తాబాద్

### వర్షాకాలంలో ఇబ్బందులే



ఏటా వర్షాకాలంలో లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతున్నది. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా ఏం చేయాలేని దుస్థితి. వంతెన నిర్మించి మా ఇబ్బందులను తొలగించాలి.

\- శ్రీనివాస్, ఉప్పరపల్లి గ్రామం,దౌల్తాబాద్


దౌల్తాబాద్‌లో దొమ్మాట లోలెవల్ వంతెన నుంచి అలుగు పారుతున్న నీరు (ఫైల్)

## గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి కోరారు. ఆదివారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గొప్పలు చెప్పుకోకుండా స్థానిక సమస్యలైన పంచాయతీ కార్మికుల వేతనాలను తక్షణమే విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

## 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం


అంబులెన్స్‌లో జన్మించిన పాపతో సిబ్బంది

నంగునూరు, సెప్టెంబరు 1: నంగునూరు మండలం ఖైసంపల్లికి చెందిన మహిళ 108 అంబులెన్స్‌లో ఆదివారం ప్రసవించింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భవానికి పురిటీ నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ ఈఎంటీ రాజకుమార్, పైలెట్ బాలరాజు గ్రామానికి చేరుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యంలో అంబులెన్స్ నిలిపి అధికారుల సూచన మేరకు పురుడు పోశారు. భవాని ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వెంటనే వారిని నంగునూరు సీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

## రాష్ట్రంలోనే ఆదర్శంగా గజ్వేల్ మార్కెట్ యార్డును తీర్చిదిద్దుతాం

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి


వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 1: రాష్ట్రంలోనే ఆదర్శంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డును తీర్చిదిద్దుతామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సంబంధించిన జీవోను విడుదల చేసిన అనంతరం పాలకవర్గ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లతో పాటు పాలకవర్గ సభ్యులను ఆదివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆశయాలకు అనుగుణంగా గజ్వేల్ మార్కెట్ కమిటీని ఆదర్శంగా మార్చుతామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా, రైతులకు మేలు చేకూర్చేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ కమిటీపై ఉందన్నారు. ఆయనవెంట మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, నాయకులు నక్క రాములు, సమీర్, సుభాష్ చంద్ర బోస్, నంగునూరి సత్యనారాయణ, యాదగిరి, గాడిపల్లి శ్రీనివాస్, జహీర్, బలరాం, శివారాంరెడ్డి, అజ్గర్, వెంకట్‌గౌడ్, రాజేశం, రమేశ్‌గుప్తా, అయిత సత్యం, నవీన్ తదితరులున్నారు.

### మార్కెట్ కమిటీ పూర్తి స్థాయి పాలకవర్గం

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని ఖరారు చేస్తూ జీవో ఆర్‌టీ నెంబర్ 651ను రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులను విడుదల చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి 18మంది సభ్యులతో కూడిన జీవోను విడుదల చేశారు. చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సర్దార్ ఖాన్, డైరెక్టర్లుగా బెల్దే నర్సింహులుగౌడ్, సముద్రాల హరినాథ్, మహ్మద్ అబ్దుల్ వహీద్, బూర్గుపల్లి కరుణాకర్‌రెడ్డి, బుడిగే యాదయ్య, పాటిమీది శ్రీనివాస్‌గౌడ్, నల్లా భానుప్రియ, పల్లా రామాగౌడ్, చిలాసాగరం వెంకటస్వామి, ఉప్పల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, గజ్వేల్ ఫాక్స్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, గజ్వేల్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌లను ప్రకటిస్తూ జీవోను జారీ చేశారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో పెరిగిన తాకిడి
- నాచగిరిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చేర్యాల, సెప్టెంబరు 1: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో భక్తిప్రపత్తులతో బెల్లంపాయసం తయారుచేసి మల్లన్నకు నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో బాలాజీశర్మ, ఏఈవో బుద్ది శ్రీనివాస్ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వర్షంకారణంగా మల్లన్న ఆలయ ముఖమండపంతో పాటు విస్తరణ మండపంలోని పలు ప్రదేశాలలో లీకేజీ అయి నీరు ఊరుస్తుంది. దీంతో ఫ్లోరింగ్‌పై జారిపడకుండా లీకేజీ నీటి కోసం టబ్బులు ఏర్పాటుచేశారు.

### చేర్యాలలో ఘనంగా బోనాలు

చేర్యాల పట్టణంలోని గ్రామదేవతలకు ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నల్లపోచమ్మ, మహంకాళీ, గడి మైసమ్మ, మాతలమ్మ, ఎల్లమ్మ, బీరప్ప తదితర దేవతలకు బోనాలు సమర్పించారు.

### సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం

కొండపాక, సెప్టెంబరు 1: మర్పడగ శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లఘున్యాస పూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ఈవో, పూజారులు


చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


చేర్యాల: ఊరేగింపుగా బీరప్ప ఆలయానికి బోనాలు తీసుకెళ్తున్న కురుమకులస్తులు


వర్గల్: నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

### ఆలయంలో ప్రత్యేక పూజలు

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 1: హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో స్వయంభూగా వెలసిన రాజేశ్వరస్వామికి నేటికి 28 ఏళ్లు చేరాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, అర్చకులు వాసుదేవశర్మ, సతీష్, నరసింహమూర్తి, పరమేశ్వర్, దీపక్‌మిశ్రా, కానుగుల మోహన్, పోగుల సంతోష్, కర్ర రవీందర్‌రెడ్డి, నర్సిహరెడ్డి, దుబామ్‌శ్రీను తదితరులు ఉన్నారు.

### వర్గల్‌లో మాస శివరాత్రి వేడుకలు

వర్గల్, సెప్టెంబరు 1: వర్గల్ శంభుగిరి కొండ గుహల్లో స్వయంభూగా వెలసిన శంభులిగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం, మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జంగం వీరభద్రయ్య ఆధ్వర్యంలో ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### నాచగిరి క్షేత్రంలో పోటెత్తిన భక్తజనం

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. స్వామివారి దర్శనం అనంతరం ఉప ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

కుకునూరుపల్లి, సెప్టెంబరు 1: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐర్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆదివారం అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగోల్ గ్రామానికి చెందిన పోచమైన లింగం తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి అందజేసినట్లు తెలిపాడు.